క్లుప్తంగా

పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు

కొమరోలు: మండలంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఎంపీడీవో నరసింహారావు ఉత్తర్వులు జారీ చేశారు. కొమరోలు, చింతలపల్లె గ్రామపంచాయతీల కార్యదర్శిగా ఉన్న కె.సురేష్‌బాబు అనారోగ్యంతో జూలై 1 నుంచి సెలవుపై వెళ్లడంతో ఆ రెండు గ్రామపంచాయతీలకు ఇతర కార్యదర్శులను నియమించారు. కొమరోలు గ్రామపంచాయతీకి రాజుపాలెం కార్యదర్శి ఎం.తిరుమలరెడ్డిని, చింతలపల్లె గ్రామపంచాయతీకి బ్రాహ్మణపల్లె కార్యదర్శి టి.గణేష్‌కు అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ఎంపీడీవో నరసింహారావు ఉత్తర్వులు జారీ చేశారు.

అమ్మవారికి సారె సమర్పణ



అమ్మవారికి పూజలు చేస్తున్న మహిళా భక్తులు

మార్కాపురం టౌన్: ఆషాఢ మాసం సందర్భంగా పట్టణంలోని మార్కండేశ్వరస్వామి దేవస్థానంలో జగదాంబ అమ్మవారికి, జ్ఞాన సరస్వతి దేవికి శుక్రవారం మహిళా భక్తులు ఆషాఢ సారె సమర్పించారు. భక్తులు పూజలు నిర్వహించి ఒడిబియ్యం, పసుపు కుంకుమ, పూలు, పండ్లు అందించారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



తువ్వపాడులో మాట్లాడుతున్న ఏఓ

కొనకనమిట్ల: భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసే రైతులకు కౌలు గుర్తింపు కార్డులు అందజేస్తామని ఏఓ ప్రసన్న రంగలక్ష్మి తెలిపారు. మంగళవారం తువ్వపాడు, కాట్రగుంట గ్రామాల్లో కౌలు రైతులతో సమావేశం నిర్వహించారు. కౌలు గుర్తింపు కార్డులతో ప్రభుత్వం రైతులకు అందించే అన్ని పథకాలు వర్తిస్తాయని తెలిపారు. వీఆర్‌ఓలు, వీఏఏలను సంప్రదించి గుర్తింపు కార్డులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

హెల్మెట్ వినియోగంతో ప్రాణాలకు రక్ష



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కొనకనమిట్ల: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడి తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలని ఎస్సై కె.మాధవరావు సూచించారు. శుక్రవారం సాయంత్రం కొనకనమిట్ల సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. మద్యం తాగి, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. హెల్మెట్ వినియోగంతో కలిగే ఉపయోగాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని పలు వాహనాలకు జరిమానా విధించారు.

కుష్టు నివారణే లక్ష్యం

- ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ సుగుణకుమార్



ఆముదాలపల్లిలో సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

పొదిలి రూరల్: కుష్టు వ్యాధి నివారణే లక్ష్యంగా వైద్య సిబ్బంది పని చేయాలని ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.సుగుణకుమార్ సూచించారు. వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఈ నెల 18 నుంచి ప్రారంభమైన సర్వే ఆగస్టు 2వ తేదీ వరకు చేపట్టాలని స్పష్టం చేశారు. గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని చెప్పారు. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఇప్పటి వరకు వైద్య సిబ్బంది మండలంలో 24 అనుమానిత కేసులు గుర్తించినట్లు తెలిపారు.

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

లింగసముద్రం: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌ఓ ఏ.మల్లికార్జున తెలిపారు. శుక్రవారం సాయంత్రం అన్నెబోయినపల్లె వద్ద ఉన్న మన్నేరు నుంచి ఇసుకను తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బంది వెళ్లారు. చీమలపెంట వద్ద ఇసుకలోడుతో వెళుతున్న ట్రాక్టర్లపై దాడిచేసి పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ చెప్పారు.

అస్తవ్యస్తంగా కొనకనమిట్ల బస్టాండ్



అర్ధంతరంగా నిలిచిన బ్రిడ్జి నిర్మాణ పనులు



బస్టాండ్ సెంటర్లో ఇలా..

- జాతీయ రహదారి పనులు అర్ధంతరంగా నిలిపివేత
- దుమ్ము రేగుతుండటంతో వాహనదారులు, స్థానికుల అవస్థలు

కొనకనమిట్ల: మండల కేంద్రమైన కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్ అస్తవ్యవస్తంగా తయారైంది. గతంలో ఎన్‌హెచ్ 565 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా మార్కాపురం–పొదిలి రహదారిలో కొంత భాగం, దొనకొండ అడ్డరోడ్డు–కనిగిరి, నెల్లూరు జిల్లా దుత్తలూరు, దోర్నాల వరకు జాతీయ రహదారిని పూర్తి చేశారు. కానీ కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్‌లో రోడ్డు, బ్రిడ్జి పనులను మాత్రం కాంట్రాక్టర్ నిలిపేశారు. దీంతో కొద్దిపాటి వర్షం పడినా బస్టాండ్ అస్తవ్యస్తంగా మారుతోంది. ఎండ కాస్తే వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము రేగుతోంది. దీంతో బస్టాండ్ సెంటర్లో ఉన్న దుకాణాలు, బడ్డీ బంకులు, హోటళ్లు దుమ్మూధూళితో నిండిపోతున్నాయి. భారీ వాహనాల టైర్ల కింద పడిన కంకర రాళ్లు విసురుగా వచ్చి మీద పడుతుండటంతో ఇతర వాహనదారులతో పాటు స్థానిక ప్రజలు, దుకాణదారులు భయాందోళనకు గురవుతున్నారు. అంతే కాకుండా రహదారి వెంట ఏర్పాటు చేసిన వీధిలైట్లు వెలగడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిలిచిపోయిన పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

బస్ షెల్టర్ లేక ఇబ్బందులు

గతంలో కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్లో ఉన్న బస్ షెల్టర్‌ను రహదారి అభివృద్ధిలో భాగంగా తొలగించారు. మళ్లీ షెల్టర్ ఏర్పాటు చేయకుండా వదిలేశారు. దీంతో బస్ కోసం వేచి ఉండేందుకు సరైన వసతి లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్ షెల్టర్ పునర్నిర్మించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



వెలగని వీధిలైట్లు

డేంజర్ ఫుడ్..!

- దుకాణాల్లో నాణ్యత లేని చిరుతిండ్ల ప్యాకెట్లతో పొంచి ఉన్న ముప్పు
- చిన్నారుల పాలిట శాపాలుగా మారుతున్న ప్యాకెట్ ఫుడ్
- చిన్నారులే లక్ష్యంగా రకరకాల స్నాక్స్ ప్యాకెట్లు
- వై.పాలెం నియోజకవర్గంలో సుమారు వెయ్యి దుకాణాల్లో విక్రయాలు
- లక్షల రూపాయల్లో వ్యాపారం
- ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం
- కనీస తనిఖీలు కూడా చేయని అధికారులు



ఓ దుకాణంలో భారీగా వేలాడదీసిన చిరుతిండ్ల ప్యాకెట్లు

పుల్లలచెరువు:

చిరుతిండ్లతో చిన్నారులకు ముప్పు పొంచి ఉంది. చిన్నారులనే లక్ష్యంగా చేసుకుని ఆకర్షించే రంగులతో రకరకాల ప్యాకెట్లలో స్నాక్స్ తయారు చేసి షాపులకు సరఫరా చేసి విక్రయిస్తున్నారు. చిన్నారులు వాటి వైపు ఆకర్షితులై అనారోగ్యం బారిన పడుతున్నారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలోని పుల్లలచెరువు, త్రిపురాంతకం, వై.పాలెం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో దాదాపు వెయ్యి దుకాణాల్లో ఎక్కడా చూసినా నాణ్యత లేని ఆహార పదార్థాల ప్యాకెట్లు కనిపిస్తున్నాయి. వ్యాపారస్తులు చేసే జిమ్మిక్కులతో పిల్లలను ఆకట్టుకునే కార్టూన్ రంగుల ప్యాకింగుల్లో చిరుతిండ్లు దర్శనమిస్తున్నాయి. వీటిని చూడగానే కొనివ్వాలంటూ చిన్నారులు మారం చేయడంతో తప్పనిసరి పరిస్థితుల్లో తల్లిదండ్రులు కొనుగోలు చేసి ఇస్తున్నారు. చివరకు అవి చిన్నారుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. వీటి వలన భవిష్యత్ పెనుముప్పు తప్పదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా మార్కెట్లోకి కల్తీ ఆహార పదార్థాలు...

ధనార్జనే ధ్యేయంగా నకిలీ చిరుతిండ్లను విచ్చలవిడిగా మార్కెట్లోకి వదులుతున్నారు. స్నాక్స్ ప్యాకెట్లుగా వాటిని చలామణి చేస్తున్నారు. వాటిపై తయారయ్యే ప్రాంత చిరునామా, ఎంఎఫ్‌డీ కూడా ఉండదు. సంస్థ పేర్లు కూడా అర్థం కాని రీతిలో ఉంటాయి. మరికొన్ని అయితే ప్రముఖ కంపెనీల పేరును పోలి ఉంటూ మార్కెట్లోకి వస్తాయి. చూడగానే తినాలనిపించే రకంగా వాటిని తయారు చేస్తున్నారు. విచ్చలవిడిగా దుకాణాల్లో ప్యాకెట్ల దండలు వేలాడతీసి అమ్ముతున్నారు. వీటికి సంబంధించి జిల్లాలో ప్రతిరోజూ లక్షల రూపాయల్లో వ్యాపారం జరుగుతోందనేది నగ్నసత్యం. వీటిపై కనీస తనిఖీ లేకపోవడంతో ఎవరిష్టం వారిది అన్నట్లుగా పరిస్థితి తయారైంది.

నాసిరకం చిరుతిండ్లు తింటే రోగాలొస్తాయి

నాసిరకం చిరుతిండ్లు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ చిరుతిండ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలనే ఉద్దేశంతో వాటిలో వివిధ రకాల కెమికల్స్ వాడుతున్నారు. రుచి కోసం ఎక్కువ మోతాదులో మసాలా, ఆకర్షణీయమైన రంగుల కోసం ప్రమాదకర పొడర్లు కూడా వినియోగిస్తున్నారు. వీటిని తినడం వలన భవిష్యత్తులో ఆరోగ్య సమస్యలు తప్పవు.

– డాక్టర్ లక్ష్మీనరసింహం, ప్రభుత్వాస్పత్రి వైద్యుడు, పుల్లలచెరువు

జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి



ప్రమాదకరమైన జంక్ ఫుడ్‌ను పిల్లలకు దూరంగా ఉంచాలి. రెడిమేడ్ తినుబండారాలు, చిరుతిండ్లను పిల్లలకు పెట్టడం వలన భవిష్యత్‌లో ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. రుచి కోసం, నిల్వ కోసం వాటిలో ప్రమాదకరమైన కెమికల్స్ వాడతారు. వీటిని తినడం వలన పిల్లలకు దురద, గుల్లలు వస్తాయి. జీర్ణకోశ సమస్య, కడుపు నొప్పి లాంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంది.

– ఎం.లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయుడు, జెడ్పీ పాఠశాల, పుల్లలచెరువు

చిరుతిండ్లకు దూరంగా ఉండాలి



నాణ్యత లేని చిరుతిండ్లు చిన్నారులే కాదు.. పెద్దలు కూడా తినకూడదు. పిల్లలు మారం చేయడం వలన తల్లిదండ్రులు ఇష్టం లేకపోయినా వాటిని కొని పిల్లలకు ఇస్తున్నారు. అలా చేయడం వలన చిన్నారుల ఆరోగ్యం దెబ్బతింటుంది. దీనిపై ప్రజల్లో విస్తృతమైన అవగాహన కల్పించాల్సి ఉంది. సంబంధిత అధికారులు నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలి.

– బి.ఓబులు, బర్డ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్

పాఠశాలల్లో నివారించి అవగాహన కల్పించాలి



పిల్లలకు ప్రమాదకరమైన చిరుతిండ్లు ముందుగా ఇళ్లలో, ఆ తర్వాత పాఠశాలల్లో నివారించాలి. సహజసిద్ధమైన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి. రెడీమెడ్ వాటి జోలికి వెళ్లకుండా పిల్లల్ని ఉంచడం ఉత్తమం. పిల్లలు మారాం చేసినా వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి. చిరుతిండ్లకు చిన్నారులను దూరంగా ఉంచేందుకు పాఠశాలల్లో అవగాహన కల్పించాలి.

– జి.గురునాథం, సీపీఐ మండల కార్యదర్శి, పుల్లలచెరువు

సెల్‌ఫోన్ వాడకం తగ్గించి పుస్తక పఠనం పెంచాలి

యర్రగొండపాలెం: సెల్‌ఫోన్‌ను తలవంచుకుని చూస్తే సమాజంలో కూడా తలవంచుకోవాల్సిందేనని, కానీ, తలవంచి పుస్తక పఠనం చేస్తే సమాజంలో తలెత్తుకునే విధంగా ఎదుగుతారని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రముఖ కవి దేవులపల్లి విశ్వనాథ్ రచించిన కవితా మంజూష గ్రంథ ఆవిష్కరణలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి పుస్తక పఠనం అలవరచుకోవాలని, నిత్యం గ్రంథాలయాలకు వెళ్లి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఆయన అన్నారు. రచయిత విశ్వనాథ్ మాట్లాడుతూ కవులు ముందు యుగపు దూతలని, వారు గతం, భవిష్యత్తుకు వారధులని, వారిని గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. విద్యార్థులు గొప్ప జ్ఞాన సంపన్నులని, ఉన్నత విద్యనభ్యసించి తమ తల్లిదండ్రులు, గురువులు, పాఠశాలలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న రచయిత విశ్వనాథ్

అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థి వెంకటస్వామి గ్రంథాన్ని ఆవిష్కరించారు. ట్రిపుల్ ఐటీకి ఎంపికైన, పాఠశాల మెరిట్ విద్యార్థులకు రచయిత, ఆవిష్కరణ కర్తలు ఒక్కొక్కరికి రూ.1116 చొప్పున అందించి ప్రోత్సహించారు. అనంతరం వారిని ఎంఈవో, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 మల్లునాయక్, హెచ్‌ఎం కె.రమాదేవి, ఉపాధ్యాయులు రజని, ఖయ్యూంబాష, మంత్రూనాయక్, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పెద్దారవీడు: ప్రస్తుతం మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ వెన్నా సంజీవరాణి సూచించారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి గ్రామంలో శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పారిశుధ్య కార్మికులచే మురికినీటిపై బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రస్తుతం అడపాదడపా కురుస్తున్న వర్షాలకు ఇంటి పరిసరాల్లో వర్షం నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వీధుల్లో మురుగనీటిపై ఉన్న దోమలను నివారించేందుకు బ్లీచింగ్ చల్లించామన్నారు. రోడ్లపై చెత్త వేయకుండా ఇంటి దగ్గరకు వచ్చిన వాహనంలో వేయాలన్నారు. ఇంటి పరిసరాల పరిశుభ్రతతో మన ఆరోగ్యాన్ని మనమే కాపాడుకోవచ్చని ప్రజలకు సూచించారు.



మురుగునీటిపై బ్లీచింగ్ చల్లుతున్న పారిశుధ్య కార్మికుడు

21న గురుపౌర్ణమి

కనిగిరి రూరల్: స్థానిక షిరిడీ సాయిబాబా దేవస్థానంలో ఈనెల 21న గురుపౌర్ణమి మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు దేవకి సుబ్రహ్మణ్యం, పెన్నా వెంకటేశ్వర్లు, ముచ్చర్ల ధర్మారావు తెలిపారు. ఆదివారం ఉదయం 9గంటలకు సామూహిక పూజలు, అభిషేకాలు, మధ్యాహ్నం అన్నప్రసాద వినియోగం, సాయంత్రం 6 గంటలకు పుష్పాభిషేకం, రాత్రి 7గంటలకు గుడి ఉత్సవాలు జరుగుతాయన్నారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, ముంతాజ్ బేగం దంపతులు పాల్గొంటారన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పొదిలి: స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్ తనిఖీ చేశారు. పలు రికార్డులు పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు, విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు గడువులోగా మంజూరు చేయాలన్నారు. తహసీల్దార్ మహ్మద్ జియాతో రెవెన్యూ సమస్యలపై మాట్లాడారు. వీఆర్‌ఓల పనితీరుపై ఆరా తీశారు.



వీఆర్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

300 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు

పొదిలి: అమృత కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో శుక్రవారం పొదిలి పట్టణంలోని విశ్వనాథపురంలో ఉన్న షన్‌షైన్ స్కూల్లో 300 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు నిర్వహించారు. అమృత హాస్పిటల్ ఎండీ డాక్టర్ వరికూటి భరత్ మాట్లాడుతూ.. పాఠశాలలో శనివారం కూడా నేత్ర పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్ భరత్

మార్కాపురం మండల అభివృద్ధికి కృషి

- ఎంపీపీ బండి లక్ష్మీదేవి

మార్కాపురం రూరల్: మార్కాపురం మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీపీ బండి లక్ష్మీదేవి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంపీటీసీ సభ్యులు తమ పరిధిలో సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ప్రాధాన్యతా క్రమంలో వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. తాగునీరు, విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని పలువురు ఎంపీటీసీ సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎంపీపీతోపాటు ఎంపీడీఓ తోట చందన స్పందిస్తూ.. ఆయా సమస్యలు పరిష్కరించేందుకు దృష్టి సారిస్తామన్నారు. అందరి సహకారంతో మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వేములకోట ఎంపీటీసీ సభ్యుడు వీరయ్య, ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, ఈఓఆర్డీ మోహన్‌రెడ్డి, అధికారులు మోహన్‌రాజు, జీవరత్నం, చందు, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ బండి లక్ష్మీదేవి, పక్కన జెడ్పీటీసీ బాపన్‌రెడ్డి, ఎంపీడీఓ చందన

మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూతనివ్వాలి

- బ్యాంకర్ల సమావేశంలో ఎంపీడీఓ చందన

మార్కాపురం: మహిళల ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు ఆర్థిక చేయూతనివ్వాలని ఎంపీడీఓ టి.చందన పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎస్‌హెచ్‌జీ గ్రూపులకు బ్యాంకులు అందించే రుణాలు, రాయితీలపై అవగాహన కల్పించాలని ఏపీఎంలు, సీసీలకు సూచించారు. మండలంలో 220 గ్రూపులకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు, 25 గ్రూపులకు రూ.5 లక్షలకు పైగా రుణ సాయం అందించాలని బ్యాంకర్లకు విజ్ఞప్తి చేశారు. కుట్లు, అల్లికలు, ఎంబ్రాయిడరీ వంటి కోర్సులు నేర్చుకునేందుకు ఆసక్తి ఉన్న మహిళలు తమ పేర్లను ఎంపీడీఓ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు, రుణాల లభ్యత గురించి వివరించారు. డ్వాక్రా మహిళలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించి బ్యాంకర్లకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కెనరా బ్యాంకు చీఫ్ మేనేజర్ మజ్జీ, డీపీఎం సుబ్బారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ చందన, పక్కన ఎల్‌డీఎం రమేష్

పశ్చిమ ప్రకాశంలో ముసురు



కొమరోలు : గోపాలునిపల్లె రహదారిలో భారీగా నిలిచిన వర్షం నీరు



మార్కాపురంలో వర్షం కురవడంతో ఖాళీగా ఉన్న రోడ్డు

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని పలు ప్రాంతాన్ని ముసురు కమ్మేసింది. గురువారం రాత్రి నుంచి మార్కాపురం, తర్లుపాడు, పెద్దారవీడు, దోర్నాల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, కంభం, బేస్తవారపేట తదితర ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. భారీ వర్షం కురిస్తే పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఖరీఫ్‌కు సంబంధించి సేద్యపు పనులు పూర్తయ్యాయి. వర్షం పడితే సజ్జ, కంది, ఆముదం, బోర్లకింద మిర్చి, పత్తి, వరి పంటలు సాగు చేసేందుకు రైతులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఖరీఫ్ ప్రారంభమై నెలా 20 రోజులు కావస్తున్నా సరైన వర్షాలు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో గత రెండురోజులుగా పడుతున్న జల్లులు ఒకింత సంతోషాన్ని నింపాయి. ముసురు పట్టడంతో ఎక్కువ మంది ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.

కొమరోలులో ఎడతెరపి లేని వర్షం

కొమరోలు: మండలంలో శుక్రవారం ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో చిరువ్యాపారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షం నీటితో రహదారులు జలమయమయ్యాయి. కొమరోలులో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వర్షం నీరు రహదారులపైనే నిలబడి పోయింది.

పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన

అర్ధవీడు (బేస్తవారిపేట): మండలంలోని పెద్ద కందుకూరు, మొహిద్దీన్‌పురం గ్రామాల్లో వ్యవసాయాధికారి షేక్ మహమ్మద్ ఆధ్వర్యంలో శుక్రవారం సీసీఆర్‌సీ కార్డులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందడం కోసం దరఖాస్తు చేసుకోవాలని, కార్డుల కాలపరిమితి 11 నెలలు ఉంటుందన్నారు. సాగు సమయంలో పంట నష్టం జరిగినా ఇన్స్యూరెన్స్, ఇన్‌పుట్ సబ్సిడీ, సబ్సిడీపై విత్తనాలు పొందవచ్చన్నారు. కౌలు రైతులు భూమి యజమానుల నుంచి పాస్‌బుక్ జెరాక్స్, అంగీకారపత్రం, ఆధార్‌కార్డు తీసుకుని పూర్తి చేసిన దరఖాస్తులను వీఆర్వోలకు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఈఓ శివగంగప్రసాద్, వీఆర్వోలు బీ వెంకటేశ్వర్లు, ఎం శ్రీనివాసులు, వీఏఏలు సీహెచ్ రాజశేఖరరెడ్డి, పీ భారతీబాయ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మహమ్మద్

ఆర్టీసీ కార్మికుల దీక్ష విరమణ



దీక్ష విరమింపజేస్తున్న సంఘ నాయకులు

పొదిలి: స్థానిక ఆర్టీసీ డిపోలో అధికారుల పక్షపాత వైఖరికి నిరసనగా ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులుగా కొనసాగిన నిరాహార దీక్ష శుక్రవారంతో విరమించారు. ఐదో రోజు దీక్షలో నరసింహారావు, సాంబశివరావు కూర్చున్నారు. యూనియన్ నాయకులతో డీఎం చర్చించి, కొన్ని డిమాండ్లు అంగీకరించడంతో దీక్ష విరమింపజేసినట్లు జాలయ్య, హనుమంతరావు తెలిపారు. తన పరిధిలో సమస్యలు పరిష్కరిస్తానని, మిగిలినవి ఆర్‌ఎం దృష్టికి తీసుకెళ్తానని డీఎం హామీ ఇచ్చినట్లు యూనియన్ నాయకులు చెప్పారు. కండక్టర్లకు డ్యూటీ చార్ట్‌లు వేయడం ప్రారంభించారని డిపో కార్యదర్శి ఓబులేసు తెలిపారు. దీక్షలో పాల్గొన్న నాయకులు, సభ్యులకు, మద్దతు తెలిపిన వారికి కృతజ్ఞతలు తెలిపారు.